సాక్షి మంచిర్యాల

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



కవ్వాల్‌లో పక్షుల పండుగ

కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో ఈ నెల 13నుంచి 15వరకు బర్డ్ వాక్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. పక్షి ప్రేమికులు అధికసంఖ్యలో రానున్నారు. 10లో▸



'తెలంగాణ తల్లి'కి క్షీరాభిషేకం

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం 27.0 / 14.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ప్రొవిజనల్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్యమిషన్ కింద జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఎస్‌హెచ్‌ఎం డీక్యూఏఎం పోస్టుకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితాను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయం, జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://mancherial. telangana.gov.inలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 13న సాయంత్రం 5గంటల్లోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వినూత్న నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట టీ గ్లాసులతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్న మాట్లాడారు. గతేడాది సెప్టెంబర్‌లో ఎస్ఎస్ఏ జేఏసీ ఆధ్వర్యంలో వరంగల్‌లో సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష చేపట్టగా, అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సందర్శించి తాము అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరించాలని నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదని వాపోయారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ జీవిత బీమా రూ.10లక్షలు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న వేసెక్టమీ ఆపరేషన్లు



శస్త్రచికిత్స చేసుకున్న వారిని అభినందిస్తున్న హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో వేసెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా కొనసాగుతున్నాయని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ తెలిపారు. కుటుంబ నియంత్రణ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసుకున్నవారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల నిర్వహించిన వేసెక్టమీ అవగాహన శస్త్రచికిత్సల పక్షోత్సవాల్లో భాగంగా 101 మంది పురుషులకు ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 33, బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో 38, చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో 30 మందికి ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. శిబిరాల్లో వైద్యులు రవీందర్, రవీంద్రప్రసాద్ వేసెక్టమీ శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఏడాదంతా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో పురుషులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చి, వేసెక్టమీ ఆపరేషన్లు చేయాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, లక్సెట్టిపేట కోర్టు జడ్జి అర్పిత మారంరెడ్డి హాజరై విద్యార్థుల్లో చైతన్యం నింపారు. అనంతరం జడ్జిని మానవ హక్కుల సంఘ సభ్యులు సన్మానించారు. జాతీయ మానవ హక్కుల సంఘం జస్టిస్, మూవెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు పెసర శ్రీకాంత్, జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

ఆవాసానికే ఆరాటం!

- ఉమ్మడి జిల్లాలో పులుల సంచారం
- కోర్‌కు వెళ్లలేక మధ్యలో సమస్యలు
- నెల రోజులుగా టైగర్ గాండ్రింపులు
- మనుషులు, పశువులపైనా దాడులు
- ఆందోళనలో అటవీ సమీప ప్రజలు



మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట రేంజ్‌లో సంచరిస్తూ కెమెరాకు చిక్కిన పులి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పులుల సంచారంతో అటవీ సమీప ప్రాంతాల్లో భయం తొలగడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా పెద్దపులుల సంచారం, దాడులు చేయడం తెలిసిందే. ఇటీవల కాగజ్‌నగర్ మండలం గన్నారానికి చెందిన ఓ యువతిపై దాడి చేసి చంపేసింది. మరుసటి రోజే సిర్పూర్ (టీ) పరిధి దుబ్బగూడలో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చింది. ఈ పులి ప్రస్తుతం తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో సంచరిస్తోంది. తాజాగా సిర్పూర్ (టీ) మండలం హుడ్కిలి గ్రామంలో ఇంటి వద్ద ఉన్న గేదె దూడపై దాడి చేసింది. అంతకు ముందు చీలపల్లి అటవీ ప్రాంతంలో సంచరించింది. దీంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పులి కాకుండా ఇంకా వేర్వేరు చోట్ల సంచరిస్తున్న పులులు అటవీ అధికారులు, స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఆవాసాలకు వెతుకులాట

ఏటా శీతాకాలంలోనే మహారాష్ట్ర నుంచి ఉమ్మడి జిల్లా అడవుల వైపు ఆవాసం, తోడు కోసం పులులు పదుల సంఖ్యలో వస్తున్నాయి. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల సరిహద్దు గుండా ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. అయితే కవ్వాల్ కోర్ ఏరియాలో పులులకు రక్షిత ఆవాసాలున్నాయి. కానీ, పులులు అక్కడి వరకు వెళ్లకుండానే తోడు, ఆవాసాలను వెతుక్కుంటున్నాయి. ఇక్కడి పరిస్థితులు అనుకూలించకపోతే కొన్ని రోజులకే తిరిగి వెళ్లిపోతున్నాయి. గత నెలలో ఓ మగపులి నిర్మల్–ఆదిలాబాద్ రహదారి మహబూబాబాద్ ఘాట్‌లో స్థానికులకు కనిపించింది. బజార్‌హత్నూరు మండలం బుర్కపల్లి, సారంగపూర్, మామడ, కడెం, ఉట్నూరు, పెంబి, ఇంద్రవెల్లి మండలం గట్టెపల్లి అటవీ ప్రాంతాల్లో కలియతిరిగింది. పశువులపై దాడి చేసింది. మరో పులి కెరమెరి, జోడేఘాట్, నార్నూరు మండలం గుంజాలలో సంచరించింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ర్యాలీ, మందమర్రి మండలం మేడారం అటవీ ప్రాంతంలోనూ ఓ పులి సంచరించింది.

వీడని భయం

పులి ఇద్దరిపై దాడి చేయడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఎక్కడ ఏ పులి సంచరిస్తుందోననే భయం వారిలో నెలకొంది. వాంకిడి మండల పరిధిలో ఓ రైతు పులిని చూశానంటూ ఆందోళనకు గురయ్యాడు. భీమిని మండలం చెన్నాపూర్‌లో పులి సంచరించినట్లు ప్రచారం జరిగింది. దీంతో పత్తి చేలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. కొన్నిచోట్ల చిరుతపులిని కూడా పులిగా భావిస్తూ ఆందోళనకు గురవుతున్నారు. భవిష్యత్‌లో ఈ పులుల రాక మరింత పెరగనుంది. అందుకు ఇక్కడి పరిస్థితులు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో అందుకు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

అటవీ అధికారుల ట్రాకింగ్

కవ్వాల్ కోర్ ఏరియాలో కాకుండా వెలుపల తిరుగుతూ అధికారులు, స్థానికుల్ని భయపెడుతున్న పులులను అటవీ అధికారులు ఎప్పటికప్పుడు ట్రాకింగ్ చేస్తున్నారు. అయితే పులి గమనాన్ని కచ్చితంగా గుర్తించలేకపోవడంతో దాడులు జరుగుతున్నాయి. ఇక తమవైపు పులులు వస్తున్నాయని రైతులు, స్థానికులు ఆందోళనతోనూ పులి జీవనానికి ఆటంకం కలుగుతోందని అధి కారులు అంటున్నారు. చాలాచోట్ల పులి ఆవాసాలకు అనుకూలత ఉన్నా స్థానికంగా ఉన్న పరిస్థితులతో వాటి సంచారానికి సమస్యలు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ఉన్నతాధికారులూ పులి సంచరించే ప్రాంతాల్లో పర్యటించారు. ఇప్పటికే కాగజ్‌నగర్‌ను శాటిలైట్ కోర్ ఏరియాగా గుర్తించాలంటూ వన్యప్రాణుల బోర్డులో ఆమోదం తెలిపింది తెలిసిందే. అయితే పులి సంరక్షణ పేరుతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కోర్ ఏరియాకు పులి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అనేక చర్యలు తీసుకున్నప్పటికీ జన్నారం మండలం కవ్వాల్ వరకు చేరడం లేదు. దీంతో పులులు కోర్ వెళ్లే మార్గ మధ్యలోనే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



సిర్పూర్(టీ) మండలం హుడ్కిలిలో అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

దూడపై దాడి.. ఆపై పట్టాలు దాటి

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలో పెద్దపులి మంగళవారం హడలెత్తించింది. సిర్పూర్(టి) మండలం హుడికిలి గ్రామానికి చెందిన దంద్రే రావుజీ ఇంటి వద్ద కట్టేసిన ఉన్న గేదె దూడపై వేకువజామున దాడి చేసి చంపింది. గ్రామంలోకి పెద్దపులి రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించి పాదముద్రలు గుర్తించారు. భయంతో ప్రజలెవరూ ఇళ్లు వదిలి బయటకు రాలేదు. అనంతరం సిర్పూర్(టి)– మాకోడి రైలు పట్టాలు దాటుతుండగా పెద్దపులి కెమెరాకు చిక్కింది. సరిహద్దు ప్రాంతంలోని మహరాష్ట్రలోని మాకోడి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటి అడవుల్లోకి వెళ్లింది. గమనించిన రైల్వే ఉద్యోగులు వీడియో తీశారు.

బోథ్ మండలంలో పులి సంచారం?

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్ బి, నాగాపూర్ గ్రామాల మధ్య పులి సంచరిస్తున్నట్లు ధన్నూర్ బి గ్రామానికి చెందిన పలువురు పేర్కొన్నారు. ఓ చేనులో కుక్కపై దాడి చేసి లాక్కెళ్లినట్లు ఓ రైతు తెలిపాడు. ఈ మేరకు గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో మైక్‌లో అప్రమత్తం చేశారు. కాగా, మంగళవారం రాత్రి అటవీ అధికారులు చేనులో పులి అడుగుల కోసం పరిశీలించారు. చిరుత సంచరించి ఉండొచ్చని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.



సిర్పూర్(టీ): పట్టాలు దాటుతున్న పెద్దపులి

ఆన్‌లైన్ ఆట.. ప్రాణాలు పణం..!

- యూట్యూబ్‌లో చూసి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి
- రూ.30లక్షలు పోగొట్టిన కొడుకు
- కుటుంబం ఆత్మహత్యాయత్నం
- కుమారుడి పరిస్థితి విషమం



మొండయ్య, శ్రీదేవి (ఫైల్)



చైతన్య, శివప్రసాద్ (ఫైల్)

బెల్లంపల్లి(తాండూర్): ఇంట్లో ఒకరు చేసిన అప్పులు ఆ కుటుంబసభ్యులనే ఆత్మహత్యాయత్నానికి పురిగొల్పాయి. తల్లిదండ్రులతోపాటు దివ్యాంగురాలైన కూతురు, అప్పు చేసిన కొడుకు సామూహిక బలవన్మరణానికి యత్నించిన ఘటన మంగళవారం తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట గ్రామానికి చెందిన చిరువ్యాపారి సముద్రాల మొండయ్యకు భార్య శ్రీదేవి, కూతురు చైతన్య (చిట్టి), కొడుకు శివప్రసాద్ ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసిన శివప్రసాద్ అనతి కాలంలో ధనవంతుడిని కావాలని కలలు కన్నాడు. యూట్యూబ్‌లో స్టాక్ మార్కెట్ వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపాడు. కొంత కాలానికి తెలిసిన వారివద్ద రూ.30లక్షల వరకు అప్పులు చేసి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. కొంతకాలానికి వడ్డీ కలుపుకొని అప్పులు రెట్టింపయ్యాయి. ఇటీవల అప్పులిచ్చినవారు ఒత్తిడి చేయగా తీర్చేమార్గం లేక శివప్రసాద్‌తోపాటు అతని తల్లిదండ్రులు మొండయ్య, శ్రీదేవి, అక్క తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం తెల్లవారుజామున మూకుమ్మడిగా శీతల పానీయంలో గడ్డిమందు కలుపుకొని తాగారు. కొద్ది సేపటి తర్వాత వీరి అరుపులు విని ఇరుగుపొరుగు వారు వచ్చి చూడగా అపస్మారక స్థితికి చేరారు. 108కు సమాచారమిచ్చి వారిని అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మంచిర్యాలకు పంపించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. ఎంజీఎంలో చికిత్స పొందుతున్న నలుగురిలో శివప్రసాద్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

దివ్యాంగురాలైన చిట్టికీ విషమిచ్చి..

మొండయ్య, శ్రీదేవి దంపతుల కూతురు చైతన్య (చిట్టి) దివ్యాంగురాలు. ఆమె ఏ పనీ చేసుకోలేని నిస్సహాయురాలు. కొడుకు చేసిన అప్పులు తీర్చే దారి లేక మూకుమ్మడిగా చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తాము ముగ్గురం చనిపోతే దివ్యాంగురాలైన చైతన్య పరిస్థితి ఏమిటని ఆలోచించారు. ఆమెకూ పురుగుల మందు తాగించినట్లు సమాచారం.

తెలంగాణతల్లి పేరిట సర్కార్ కుట్ర

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి పేరిట కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ టూటౌన్ ప్రాంతంలో గల తెలంగాణతల్లి విగ్రహానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కుట్రతో తెలంగాణ తల్లిని అవమానపరిచేలా మరో విగ్రహాన్ని రూపొందించి ఆవిష్కరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ పండుగకు మహిళలకు చీరెలు ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణతల్లి చేతిలోని బతుకమ్మను తీసేశారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీ భవన్‌కు పంపుతామని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నస్పూర్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, శ్రీరాముల సుజాత, మల్లేశ్, హఫీజా బేగం, తాజొద్దీన్, బేర సత్యనారాయణ, అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దివాకర్‌రావు

క్రీడలతో మానసికోల్లాసం

- కలెక్టర్ కుమార్‌దీపక్
- సీఎం కప్ క్రీడలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని న్యూ నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కప్ క్రీడాపోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. ప్రభుత్వం త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందని, గ్రామ, మండల, పట్టణ, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబర్చినవారికి యూనివర్సిటీలో రిజర్వేషన్ కల్పిస్తుందని తెలిపారు. తద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పట్టణ స్థాయిలో రాణించిన వారు ఈ నెల 16 నుంచి 21వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంత వాసులు క్రీడల్లో రాణించడానికి ఏరియాలో సంస్థ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. వాలీబాల్, 200, 400, 800 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, ఎంఈవో దామోదర్, జిల్లా యువజన క్రీడాధికారి రాజవీర్, కమిషనర్ సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, బొద్దున సంధ్యారాణి, ట్రస్మా పట్టణాధ్యక్షుడు మైదం రామకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షుడు రేగళ్ల ఉపేందర్, నాయకులు బత్తిని దేవన్న, ఊట్ల సత్యనారాయణ, రాజ్‌కుమార్, పీఈటీలు జ్యోతి, విఠల్ తదితరులున్నారు.

నీరసించిన విద్యార్థులు

పోటీలు ఆలస్యంగా మధ్యాహ్నం ప్రారంభం కావడంతో నిర్వాహకులు విద్యార్థులకు కనీసం భోజన సౌకర్యం కల్పించలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నీరసించిపోయారు. నిర్వాహకులు విద్యార్థికో అరటి పండు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. స్థానిక ట్రస్మా నాయకులు బిస్కెట్ ప్యాకెట్లు తెప్పించి ఇచ్చారు. నిర్వాహకుల తీరుపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో క్రీడా మైదానానికి పాఠశాలలు దూరంగా ఉన్నా విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లి లంచ్ బాక్సులు తెచ్చుకుని భోజనం చేశారు.

ఫలించిన రక్షణ సూత్రం

- భారీగా తగ్గిన గని ప్రమాదాలు
- సత్ఫలితాలనిస్తున్న ఎస్వోపీలు
- మానవ తప్పిదాలు తగ్గితేనే.. జీరోకు చేరనున్న యాక్సిడెంట్లు
- కొనసాగుతున్న రక్షణ పక్షోత్సవాలు



శ్రీరాంపూర్: సింగరేణిలో పెరిగిన సాంకేతికత, రక్షణ చర్యలతో ప్రతీ సంవత్సరం ప్రమాదాల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడం, కార్మికులకు రక్షణ చర్యలపై అవగాహన కల్పించడంతోనే ఇది సాధ్యమైంది. సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 9నుంచి 55వ రక్షణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి గనులు, డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేస్తున్నారు. రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేస్తున్నవారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు. సింగరేణిలో గతంలో నిత్యం ఏదో చోట ప్రమాదం జరిగి ఉద్యోగులు మృత్యువాత పడేవారు. ఏడాదిలో సగటున 20మందికి పైగా ప్రమాదాల్లో మృత్యువాతపడే వారు. దీన్ని జీరో చేయాలనే లక్ష్యంతో కంపెనీ ముందుకెళ్తోంది.

పకడ్బందీ కార్యాచరణతో..

గనుల్లో రక్షణ చర్యలను పటిష్టం చేయడానికి కంపెనీలో ఇంటర్నల్ సేఫ్టీ ఆర్గనైజేషన్ ఉంటుంది. ఇది ప్రమాదాలు జరిగినప్పుడు తనిఖీ చేసి రిపోర్ట్ ఇస్తుంది. ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. 2019లో రీజియన్ల వారీగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎంపీ)లు తయారు చేశారు. ఇందులో శిక్షణ పొందినవారు గనులవారీగా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్వోపీ) తయారు చేసి దానికి తగినట్లు మైనింగ్ వ్యవహారాలను నడిపిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ విధానం మంచి ఫలితాలు సాధిస్తుండగా ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి.

తగ్గిన ప్రకృతి ప్రమాదాలు

ఒకప్పుడు గనుల్లో పైకప్పు కూలే ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. యాంత్రీకరణ పెరిగి ఎస్‌డీఎల్స్ వచ్చిన తర్వాత రూఫ్‌సపోర్టింగ్‌లో మార్పులు చేశారు. అప్పటివరకు పైకప్పు నుంచి రక్షణకు దిమ్మెలు, దాటు చెక్కలు పెట్టి మాత్రమే సపోర్టు చేసేవారు. క్రమంగా వాటి స్థలంలో రూఫ్‌బోల్టింగ్, కేబుల్ బోల్టింగ్ చేస్తున్నారు. దీంతో రూఫ్ ప్రమాదాలు చాలా తగ్గాయి. రూఫ్ బోల్టింగ్‌కు వాడేందుకు కంప్రెషన్ మిషన్లు కూడా వచ్చాయి. ఇక రూఫ్ నుంచి వచ్చే ఒత్తిడిని ఎప్పటికప్పుడు స్ట్రాటా మానిటరింగ్ చేస్తున్నారు. దీనికి లోడ్ సెల్, కన్వేర్జెన్స్, టెల్‌టేయిల్ తదితర పరికరాలను వినియోగించి రూఫ్ కూలడానికి ఏమాత్రం అవకాశమున్నా ముందే పసిగడుతున్నారు. దీంతో పాటు లాంగ్‌వాల్ గనుల్లో అత్యుత్తమ టెక్నాలజీ చాక్‌షీల్డ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇక హాలేజీ ప్రమాదాలనూ పూర్తిగా రూపుమాపారు. అన్ని గనుల్లో మ్యాన్‌రైడింగ్ ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే ఉద్యోగులు విధులకు వెళ్లి వస్తుండటంతో ఈ తరహా ప్రమాదాలు జీరో అయ్యాయి. అలాగే గ్యాస్ ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి గతంలో సేఫ్టీ ల్యాంప్ (రక్షణదీపం) ఒక్కటే ఉండేది. నేడు అదనంగా సీవో డిటెక్టర్, ఆక్సీమీటర్, మల్టీడిటెక్టర్ వచ్చాయి. ఏ గ్యాస్ ఎంత ఉత్పత్తన్నమవుతుందో వీటి ద్వారా పసిగట్టవచ్చు. బ్లాస్టింగ్ ప్రమాదాలను తగ్గించడానికి బ్లాస్టింగ్ కార్డు సత్ఫలితాలనిస్తోంది.

ఇంకా మానవ తప్పిదాలు

గతంలో భూగర్భంలో ప్రకృతి ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. వీటిని కట్టడి చేస్తున్న క్రమంలో ఇటీవల మానవ తప్పిదాలతో ప్రమాదాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. షార్ట్‌కట్‌లో పని చేయడమే ఇందుకు కారణం. సరైన రక్షణతో పని చేస్తే ఇలాంటివి జరగవని అధికారులు పేర్కొంటున్నారు. యంత్రాలను ఆపరేటింగ్ చేసే క్రమంలో కూడా రిపోర్టబుల్ యాక్సిడెంట్లు నమోదవుతున్నాయి.

శ్రీరాంపూర్‌లో తగ్గిన ప్రమాదాలు

కంపెనీలో అత్యధిక భూగర్భ గనులు, అధిక ఉద్యోగులు పని చేస్తున్న శ్రీరాంపూర్ ఏరియాలో ఈ సంవత్సరం ప్రమాదాల సంఖ్య చాలా తక్కువగా ఉంది. 1.1.2024 నుంచి 9.12.2024 వరకు ఒక్క మరణం సంభవించలేదు. సీరియస్ ప్రమాదాలు కూడా తక్కువగానే నమోదయ్యాయి. 18 ప్రమాదాల్లో 18 మంది మాత్రమే తీవ్రంగా గాయపడ్డారు. 10 రిపోర్టబుల్ కేసులు మాత్రమే నమోదు చేసుకున్నట్లు కంపెనీ అధికారులు చెబుతున్నారు.

మరింత రక్షణ పెంచాల్సిందే

ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో బొగ్గు గనుల్లో ప్రమాదాలు అరుదు. అక్కడ పూర్తి రక్షణ ఉంటుంది. సేఫ్టీకి అక్కడి సంస్థలు అధిక ప్రాధ్యాతనిస్తాయి. ప్రతీ ఉద్యోగి స్వీయరక్షణ పాటిస్తారు. కాగా, మన వద్ద సేఫ్టీలో చాలా లోపాలున్నట్లు కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. నిర్ణీత సమయానికి సేఫ్టీ సమావేశాలు నిర్వహించకపోవడం, సేఫ్టీ కమిటీల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయకపోవడం, నాసిరకం యంత్రాల స్పేర్స్ రావడం, పనిముట్ల కొరత తదితర కారణాలు జీరో ప్రమాదాల నినాదానికి తూట్లు పొడుస్తున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు. చాలా గనుల్లో కాలంచెల్లిన ఎస్‌డీఎల్స్‌ను వాడుతున్నారనే ఆరోపణలున్నాయి.

గత ఐదేళ్లలో ప్రమాదాల వివరాలు (డిసెంబర్ 9 నాటికి)

సంవత్సరం	మృతుల సంఖ్య	తీవ్రంగా గాయపడ్డవారు
2020	12	101
2021	13	122
2022	5	96
2023	5	68
2024	5	84

సేఫ్టీకే మొదటి ప్రాధాన్యత

ఉత్పత్తి తగ్గినా పర్వాలేదు గాని సేఫ్టీకే మొదటి ప్రాధాన్యతనిస్తున్నాం. ఎక్కడా ప్రమాదాలు జరగకూడదని సీఎండీ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ పద్ధతులు పాటిస్తున్నాం. ఉద్యోగులకు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నాం. రక్షణ కోసం ఖర్చుకు వెనుకాడకుండా పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. జీరో హార్మ్ సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– జీఎం ఎల్వీ సూర్యనారాయణ

అభ్యంతరాలుంటే తెలుపండి

- కలెక్టర్ కుమార్ దీపక్
- పోలింగ్ సెంటర్ల ఏర్పాటుపై సమీక్ష

మంచిర్యాలఅగ్రికల్చర్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో గుర్తించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో అభ్యంతరాలుంటే తెలుపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతితో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 311 గ్రామపంచాయతీల్లో 2,730 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 4,57,157 మంది జనాభా ఉండగా 3,84,746 మంది ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 650 మంది కంటే ఎక్కువ ఓటర్లుంటే సహాయ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,574 పోలింగ్ కేంద్రాలు, 141 తాత్కాలిక, 15 ప్రైవేట్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఈ నెల 12లోపు అభ్యంతరాలుంటే స్వీకరించాలని, 13న అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. 16న తుది జాబితా ప్రచురణకు ఆమోదం పొంది 17న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు సరిపడా అందుబాటులో ఉన్నాయని, బ్యాలెట్ పేపర్ల ప్రచురణకు ప్రింటింగ్ ప్రెస్‌ను గుర్తించినట్లు తెలిపారు. డివిజన్, జిల్లా స్థాయిలో ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య


వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై దేవు

కడెం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్, ఏఎస్సై దేవు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దబెల్లాల్ జీపీ పరిధిలోని ఉప్పరిగూడెంకు చెందిన కమ్మరి బాలరాజు (30) మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య నవీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై దేవు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ..

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లి గ్రామ పంచాయతీకి చెందిన కొట్రంగి పున్నం (31) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. గ్రామానికి చెందిన పున్నంకు పుట్టుకతోనే రేచీకటి, మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో మంగళవారం రూ.5వేలు ఇవ్వాలని ఇంట్లో తండ్రితో గొడవపడ్డాడు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూతురు అదృశ్యం.. తండ్రి బలవన్మరణం


బాబురావు(ఫైల్)

కౌటాల(సిర్పూర్): ఎంతో అల్లరు ముద్దుగా పెంచుకున్న ఏకైక కుమార్తె అదృశ్యం కావడంతో ఆ తండ్రి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమురం భీం జిల్లా కౌటాల మండలం కన్నెపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టాకిరే బాబురావు (52), సావిత్రబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె మానస ఉన్నారు. ప్రస్తుతం మానస మంచిర్యాలలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన కూతురు ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బాబురావు ఈ నెల 7న కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుమార్తెపై బెంగతో తండ్రి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని పెద్ద కుమారుడు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు.


బైసన్‌కుంటలో తిరుగుతున్న గార్గాని డక్స్


బైసన్ కుంటలో కస్టడ్ ఫిష్ ఈగల్


మైసమ్మ కుంటలో ఉలీమేకెడ్ పక్షులు, మైనా

కవ్వాల్‌లో పక్షుల పండుగ

పక్షుల పండుగకు వేళైంది. కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పక్షి ప్రేమికులు వాటిని తిలకించేందుకు అటవీశాఖ అధికారులు బర్డ్‌వాక్ పేరిట అవకాశం కల్పిస్తున్నారు. రెండేళ్లుగా ఫిబ్రవరిలో బర్డ్‌వాక్ నిర్వహించగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి అనేక మంది పక్షి ప్రేమికులు వచ్చి పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. ఇందులో భాగంగా మూడోసారి బర్డ్‌వాక్ ఈవెంట్ చేసేందుకు అటవీశాఖ అధికారులు సమాయత్తం అయ్యారు.

- ఈ నెల 13 నుంచి 15 వరకు
- మూడోదశ బర్డ్‌వాక్ ఫెస్టివల్
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

జన్నారం(ఖానాపూర్): జన్నారం అటవీ డివిజన్‌లోని కల్పకుంట, బైసన్‌కుంట, మైసమ్మకుంట, తదితర ప్రాంతాల్లోని అడవుల్లో వివిధ రకాల పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. విదేశాల నుంచి వచ్చిన పక్షులు కూడా ఇక్కడ కనిపిస్తాయి. ఎప్పుడూ చూడని అరుదైన పక్షులకు ఆవాసంగా జన్నారం అటవీ డివిజన్ ఉంది. అధికారులు, సిబ్బంది పక్షుల రకాలు, వాటి శాస్త్రీయ నామాలు, వివరాలు తెలుసుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌ను పక్షులకు కూడా ఆవాసంగా గుర్తించారు.

కార్యక్రమం ఇలా..

బర్డ్‌వాక్‌కు పక్షి ప్రేమికులు, ఫొటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందువల్ల కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. రెండేళ్లపాటు నిర్వహించిన కార్యక్రమానికి మహారాష్ట్ర, కాకినాడ, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, తదితర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు, ఫొటోగ్రాఫర్లు వచ్చారు. మొదటి విడతలో 60 మంది, రెండో విడతలో వందమందికి పైగా హాజరయ్యారు. వాటిని దృష్టిలో పెట్టుకుని ఈసారి రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ నెల 13న బర్డ్ వాచర్ల పేర్లు నమోదు చేసుకుని సాయంత్రానికి రెండు గ్రూపులుగా విభజిస్తారు. ఒకగ్రూపు బర్తన్‌పేట్ క్యాంపు, మరోగ్రూపు బైసన్‌కుంటలో రాత్రి బస చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి అక్కడే ఉండి 14న ఉదయం పక్షులను తిలకించే వీలు కల్పిస్తున్నారు. 14న రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అదే రోజు రాత్రి బసచేసి 15న ఉదయం బర్డ్‌వాక్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి వారి అనుభవాలను తెలుసుకుంటారు.

ముందుగానే రిజిస్ట్రేషన్

బర్డ్‌వాక్ ఫెస్టివల్‌లో భాగంగా పక్షులను తిలకించేందుకు వచ్చేవారు ముందుగానే రూ.2వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వారి వివరాలు నమోదు చేసుకుని తగిన ఏర్పాట్లు చేస్తారు. ఫోన్ ద్వారా చేయించుకునే వారు 9441057771 నంబరుకు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు జన్నారం రేంజ్ అధికారి సుష్మారావు 99895 91096, ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ 96183 57086ను సంప్రదించాలి.


గతేడాది బర్డ్‌వాక్‌లో పాల్గొన్న పక్షి ప్రేమికులు

అడవుల్లోనే బస

బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కు వచ్చే ప్రకృతి ప్రేమికులకు అటవీశాఖ అధికారులు మంచి ఆతిథ్యం ఇస్తున్నారు. నేచర్ ఎంజాయ్ చేసే విధంగా వచ్చిన వారికి జన్నారం అటవీ డివిజన్‌లోని బైసన్‌కుంట, ఇందన్‌పల్లి రేంజ్‌లోని బర్తన్‌పేట్ బేస్‌క్యాంప్‌లలో డేరాలు ఏర్పాటు చేసి అందులో బస చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఉంటుందని అధికారులు తెలిపారు.

నిబంధనలు

ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్నాక డబ్బులు తిరిగి ఇవ్వడం, వ్యక్తులను మార్చడం కుదరదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి ఆహారం, ఆవాసంతో పాటు లోకల్ ట్రాన్స్‌పోర్టు సౌకర్యం ఉంటుంది. డార్క్‌బ్రౌన్ లేదా గ్రీన్ డ్రెస్ వేసుకోవాలి. వాటర్ బాటిల్, బెడ్‌షీట్, షూ, టార్చ్, దోమల కాయల్ వెంట తెచ్చుకోవాలి. ఎమర్జెన్సీ మెడిసిన్ అవసరమున్న వారు వెంట తెచ్చుకోవాలి. ఆల్కహాల్, సిగరేట్ నిషేధం.

రెండు రోజులు నిర్వహిస్తాం



ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈనెల 13, 14 తేదీలలో ఒకబ్యాచ్, 14, 15 తేదీలలో మరోబ్యాచ్ బర్డ్‌వాక్ నిర్వహిస్తున్నాం. దూరప్రాంతాల నుంచి వచ్చే పక్షి ప్రేమికులకు మంచి అనుభూతి వస్తుంది. అడవిలో ఒక రోజు గడిపి నేచర్ ఎంజాయ్ చేస్తారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– సుష్మారావు, అటవీ రేంజ్ అధికారి, జన్నారం

ముఖరా(కే)కు రెండు అవార్డులు


అవార్డులు అందుకుంటున్న ప్రత్యేకాధికారి

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ముఖరా(కే) గ్రామానికి రెండు అవార్డులు దక్కాయి. వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో బెస్ట్ టాయిలెట్‌లను ఎంపిక చేసి హమారా సౌచాయ్...హమారా సమ్మాన్ అవార్డులను అందజేసింది. డీఆర్డీవో పీడీ సాయన్న చేతుల మీదుగా వ్యక్తిగత మరుగుదొడ్డి కింద గ్రామానికి చెందిన చౌహాన్ శోభ, సామూహిక మరుగుదొడ్డి కింద పంచాయతీ ప్రత్యేకాధికారి జాదవ్ కైలాస్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆశిష


సుదమల్ల ఆశిష

మంచిర్యాలటౌన్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల పట్టణానికి ఎందిన సుదమల్ల ఆశిష ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం జరిగిన ఎన్నికల్లో 4,062 ఓట్లు సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

చిరుత దాడిలో గొర్రెపిల్ల హతం


గొర్రె పిల్ల కళేబరం

నర్సాపూర్(జి): చిరుత దాడిలో గొర్రె పిల్ల మృతి చెందిన సంఘటన మండలంలోని కుస్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామంలోని మహేష్‌కు చెందిన గొర్రెపిల్లపై చిరుత పులి దాడి చేసి హతమార్చింది. సంఘటన స్థలాన్ని ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డి పరిశీలించారు. గ్రామస్తులెవరూ అడవిలోకి ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు సూచించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన విద్యార్థి


లక్ష్మణ్ (ఫైల్)

లక్ష్మణచాంద(నిర్మల్): నెలరోజులుగా మృత్యువుతో పోరాడిన ఓ విద్యార్థి చివరికి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని వడ్యాల్‌కు చెందిన పూసపత్రి సుమలత, శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు లక్ష్మణ్ (14)కు నెలరోజుల క్రితం జ్వరం రావడంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే కోమాలోకి వెళ్లాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడలేదు. దీంతో కొద్ది రోజుల కిందట ఇంటికి తీసుకొచ్చారు. నాలుగు రోజుల క్రితం కోమా నుంచి బయటకు వచ్చినా నోటి నుంచి మాట రాలేదు. మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచాడు. దీంతో వడ్యాల్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్ బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.10 లక్షలు చెల్లించాలని స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు లైసన్ ఆఫీసర్ గులామ్ దస్తగిర్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన బోడ హరినాయక్ వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బోగి రజిత తమ అవసరం నిమిత్తం రూ. 5 లక్షలు అప్పుగా తీసుకుంది. ఇందుకు జమానత్‌గా చెక్కులు ఇచ్చింది. అప్పు తిరిగి చెల్లించే సమయంరాగానే హరినాయక్ చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేశాడు. రజిత ఖాతాలో డబ్బులు లేకపోవడంతో చెక్‌బౌన్స్ అయ్యింది. హరినాయక్ పలుమార్లు అడిగినా ఫలితం లేక పోవడంతో 2018లో కోర్టులో కేసు వేశాడు. రజితకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ రూ.10లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు వెల్లడించారు.

గృహహింస కేసులో ..

బెల్లంపల్లి(తాండూర్): అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు కోర్టు ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. తాండూర్ ఐబీ ప్రాంతానికి చెందిన జ్యోతికి కాగజ్‌నగర్‌కు చెందిన చిలుక తిరుపతితో 2009లో వివాహమైంది. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త తిరుపతితో పాటు అత్త వీరమ్మ, ఆడపడుచులు వజ్రమ్మ, భాగ్యలక్ష్మి వేధింపులకు గురిచేశారు. దీంతో సదరు మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌హెచ్‌ఓ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసుకుని భర్త, ఆడపడుచులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్‌హెచ్‌వో కిరణ్‌కుమార్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువు కావడంతో మంగళవారం బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జె.ముకేష్ తిరుపతికి ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కాసిపేట: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సాలేగూడకు చెందిన సిడాం పండు ఈ నెల 8న ఇంటికి తాళం వేసి తిర్యాణికి వెళ్లాడు. గమనించిన అదే గ్రామానికి చెందిన మడావి జంగు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 6.5 గ్రాముల బంగారు, 35 గ్రాముల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. మంగళవారం వాటిని విక్రయించేందుకు మంచిర్యాలకు వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు అతన్ని ఆపి విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పీడీయాక్ట్ నమోదు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలంలో ఆగస్టు 31న ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన షేక్ మగ్దూంపై పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిపై చర్యలకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా అడ్వైజరీ బోర్డు సభ్యుల ఆమోదంతో పీడీయాక్ట్ అమలు చేశారు.

ఆవు మాంసం తరలిస్తున్న ఆటో పట్టివేత


పోలీసుల అదుపులో ఆటో, నిందితుడు

మంచిర్యాలక్రైం: జగిత్యాల నుంచి మంచిర్యాలకు ఆవు మాంసం తరలిస్తున్న ఆటోను హిందూ సంఘాల నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల నుంచి కొందరు వ్యక్తులు ఆవు మాంసాన్ని తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు భారతీయ కిసాన్ సంఘ్, పలు హిందూ సంఘాల కార్యకర్తలు మంగళవారం పాత మంచిర్యాల సమీపంలో పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను తనిఖీ చేయగా సుమారు 50 కిలోల ఆవుమాంసం లభించింది. మాంసం తరలిస్తున్న జగిత్యాలలోని గాంధీనగర్‌కు చెందిన షాదుల్ల బాబాను విచారించగా జగిత్యాలకు చెందిన మున్వార్ అనే వ్యక్తి మంచిర్యాలలోని సలీమ్ కళ్యాణి బిర్యాని హోటల్‌కు తరచూ తరలిస్తున్నట్లు తెలిపాడు. ఈ మేరకు స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కు ఫిర్యాదు చేయగా మందమర్రి పశు వైద్యాధికారి తిరుపతిచే నమునాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారి ప్రాణాలు చిదిమేసిన ట్రాక్టర్ టైర్

- ఆడుకుంటుండగా తలపై పడడంతో ఘటన


రిషిధర్ (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అప్పటి వరకు ఆడుకుంటున్న ఆ బాలుడి పాలిట ట్రాక్టర్ టైర్ శాపంగా మారింది. ఈ హృదయ విదారక సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పరిధిలోని గొల్లపల్లికి చెందిన ర్యాకల మల్లీశ్వరి, పోషన్న దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు రిషిధర్(9) సోమవారం ఇంటి పక్కనే ఆడుకుంటూ ఉండగా ఆ ఇంటి యజమాని తన ట్రాక్టర్ టైర్‌ను తీసి కేజీ వీల్స్ వేసుకుని వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. టైర్ వద్ద ఆడుకుంటుండగా ఒక్కసారిగా బాలుడి మీద పడింది. తీవ్రగాయాలు కాగా రక్తపుమడుగులో రోదిస్తూ ఉండగా గమనించిన తల్లిదండ్రులు వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుమారుడు తమ కళ్ల ముందే మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

హైనా దాడిలో మేక మృతి

కౌటాల: మండలంలోని తలోడి గ్రామానికి చెందిన కొడిపె సిద్ధయ్య, విమల దంపతులు మంగళవారం ఉదయం గ్రామ శివారులోని పంటచేనులో పత్తి తీసేందుకు వెళ్లారు. ఒక మేకను చెట్టుకు కట్టేసి మిగతా రెండు పిల్లలను చేనులో వదిలారు. ఒక మేక పిల్లపై హైనా దాడి చేయడంతో మరో మేకపిల్ల అరుస్తూ విమల వైపు పరిగెత్తుకుంటూ వచ్చింది. విమల వెళ్లి చూడగా హైనా మేకను చంపి తింటూ కనిపించింది. విమల కేకలు వేయడంతో మేకను వదిలి పారిపోయింది. హైనాను ఎప్పుడూ చూడని విమల తమ మేకను పట్టింది పులి అనుకొని తీవ్ర భయాందోళనకు గురైంది. తలోడి సమీపంలో పులి దాడిలో మేక మృతి చెందిందని వదంతులు రావడంతో సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సాహు, అటవీశాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పులి దాడిలో మేక మృతి చెందినట్లు వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. పులికి సంబంధించిన ఎటువంటి పాదముద్రలు లేవన్నారు. హైనా దాడిలోనే మేక మృతి చెందిందని, హైనాకు సంబంధించిన పాదముద్రలను గుర్తించామన్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో ఇక్బాల్‌హుస్సేన్, డీఆర్వో హైమావతి, ఎఫ్‌బీవో ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట మౌనపోరాటం


మౌన పోరాటం చేస్తున్న యువతి

ఖానాపూర్: ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు మౌనపోరాటానికి దిగిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. సదరు యువతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన రజిని, మస్కాపూర్ గ్రామానికి చెందిన నరేందర్ నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ప్రియుడు వేరే పెళ్లి చేసుకోవాలని చూస్తున్నాడని తెలియడంతో ఈ విషయమై నరేందర్‌ను నిలదీసింది. దీంతో తమ గ్రామానికి వచ్చి తనపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టేందుకు యత్నించాడని తెలిపింది. అయినప్పటికీ తాను వారి ఇంటికి వచ్చి పెళ్లి చేసుకోవాలని కోరడంతో యువకుడితో పాటు అతని కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. కేవలం కులం కారణంగానే తనతో పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు పెళ్లిచేసి న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వడగామ్ గ్రామానికి చెందిన రాయిసిడాం రవి సోమవారం ద్విచక్ర వాహనంపై ఇంద్రవెల్లికి వచ్చి రాత్రి ఇంటికి వెళ్తుండగా జైత్రంతాండ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన మరో కారు

సారంగపూర్(నిర్మల్): మండలంలోని ధని గ్రామ సమీపంలో మంగళవారం ఆగి ఉన్న కారును మరోకారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన వినయ్ తన కారును రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి పంటపొలానికి వెళ్లాడు. ఇదే సమయంలో నిర్మల్ వైపు నుంచి సారంగాపూర్ వైపు కారులో వెళ్తున్న షేక్ అస్లాం అతివేగంగా వచ్చి ఆగిఉన్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళ, ఏడేళ్ల బాలుడు, శేక్ అస్లాంకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనలో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చెరువులో పడి ఒకరు మృతి

ముథోల్: చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన కస్వ శ్రీనివాస్ (48)కొంతకాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం ఊరి పొలిమేరలో ఉన్న చెరువులో మృతదేహం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

టీజీబీ మేనేజర్ నిర్లక్ష్యంతో రూ.లక్ష నష్టం


బ్యాంకు స్టేట్‌మెంట్ చూపిస్తున్న చంద్రమణి

బేల: పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ నిర్లక్ష్యంతో రూ.లక్ష నష్ట జరిగిందని పండ్ల వ్యాపారి చంద్రమణి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 7న సిమ్ బ్లాక్ అవుతుందని, పాన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు నంబరు చెప్పాలని అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చిందన్నారు. దీన్ని గుర్తించి బ్యాంకుకు వెళ్లి బ్యాంకు ఖాతాను హోల్డ్ చేయాలని బ్యాంకు మేనేజర్‌కు విన్నవించానని తెలిపాడు. మేనేజర్ స్పందించకపోగా దరఖాస్తు ఫారం నింపి ఇవ్వాలని చెప్పారన్నారు. ఇది పూర్తిచేసే క్రమంలో రూ.లక్ష బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్లు పేర్కొన్నాడు. బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యం, తప్పిదంతో రూ.లక్ష ఆర్థికంగా నష్టం జరిగిందని వాపోయాడు.



సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES
VEHICLE FOR SALE

VEHICLES FOR SALE on Where conditions vehicles for Sale. Ashok Leyland 1915 HE HSD FBT BS VI-2023 TS01 UC 7511. IndusInd Bank Ltd., Mancherial Branch. Contact: Cell: 7338879680. [K- 1253271]

SERVICES
BUSINESS OFFER

మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]

www.sakshi.com

WANTED

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్, జీ: 18K. Ph: 9160900024, 9640400073 [SCA24000764]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,